సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 15 । ఆగస్టు । 2023

జెండా వందనానికి కలెక్టరేట్ ముస్తాబు



సిరిసిల్ల: స్వాతంత్య్ర వేడుకలకు కలెక్టరేట్ సోమవారం సాయంత్రం ముస్తాబైంది. మంగళవారం నిర్వహించే 76 ఏళ్ల స్వాతంత్య్ర దినోత్సవానికి జిల్లా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యా నాయక్ పర్యవేక్షిస్తున్నారు. కలెక్టరేట్‌లో జాతీయ జెండాను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు మంగళవారం ఉదయం 11.00 గంటలకు ఆవిష్కరించి ప్రసంగిస్తారు. ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందిస్తారు. వర్షం వచ్చినా వేడుకలకు ఆటంకం ఏర్పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన



మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: జిల్లాలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు తంగళ్లపల్లి మండలం సారంపల్లి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి, గౌడ కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించనున్నారు.

గాంధీ చిత్రాన్ని వీక్షించిన విద్యార్థులు



గాంధీ చిత్రాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, అధికారులు

సిరిసిల్లకల్చరల్: స్వాతంత్య్ర వజ్రోత్సవ ముగింపు సందర్భంగా సిరిసిల్లలో ప్రదర్శించిన గాంధీ చిత్రాన్ని సోమవారం విద్యార్థులతోపాటు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీపీఆర్వో దశరథం, డీఈవో రమేశ్, డీఎస్‌వో పాముల దేవయ్య వీక్షించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించడంతో గాంధీజీ జీవితం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. జాతిపిత స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ సైతం అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా స్వరాష్ట్రాన్ని సాధించారన్నారు. తొలి రోజు 1,767 మంది విద్యార్థులు వీక్షించారు. ఈ నెల 24 వరకు ఈ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

హామీలే తప్ప అమలేది?



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు శాత్రాజుపల్లిలో ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. దళితులకు మూడెకరాలు, రైతు రుణమాఫీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి పథకాలు ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. మళ్లీ హామీలతో ప్రజల వద్దకు వస్తారని, అలాంటి వారిని నమ్మొద్దని కోరారు. నాయకులు సంగ స్వామి, సంగ హన్మవ్వ, వార్డు ప్రజలు ఉన్నారు.

కుష్ఠు నిర్మూలనే లక్ష్యం

సిరిసిల్లటౌన్: కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ఈనెల 16 నుంచి 31 వరకు ఎల్‌సీడీసీ కార్యక్రమం చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ)పై మంగళవారం నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. సర్వేలో 476 టీములు పాల్గొంటాయని, కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని సమీపంలోని ఆరోగ్యకేంద్రానికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తారని తెలిపారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, ప్రోగ్రాం ఆఫీసర్ రజిత, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతులు కల్పించాలని కోరుతూ విద్యార్థులు సోమవారం ధర్నా చేపట్టారు. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యాయులు లేరన్నారు. అన్నంలో పురుగులు వస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ కస్తూరి కార్తీక్, ప్రకాశ్, మధు, గౌతం, నాగరాజు, యశ్వంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



తుది దశకు వర్క్‌షెడ్ పనులు

మహిళలకు మరింత ఉపాధి

- ఏడెకరాల్లో టెక్స్‌ఫోర్ట్ యూనిట్
- అపెరల్ పార్క్‌లో 1.60 లక్షల ఎస్ఎఫ్‌టీ షెడ్డు
- 2400 మందికి ఉపాధి లక్ష్యం
- తుది దశకు చేరిన పనులు

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు మరిన్ని దరిచేరనున్నాయి. ఇప్పటికే అపెరల్‌పార్క్‌లో గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ రెడీమేడ్ వస్త్రాలను ఉత్పత్తి చేస్తుండగా.. మరికొద్ది రోజుల్లోనే మరో పెద్ద సంస్థ టెక్స్‌పోర్ట్ కంపెనీ యూనిట్‌ను ప్రారంభించనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో ఏడాది కిందట ఆ కంపెనీ ఎంవోయూ పూర్తి చేసుకోగా.. అపెరల్ పార్క్‌లో వర్క్‌షెడ్ నిర్మాణంలో ఉంది. ఏడెకరాల్లో టెక్స్‌ఫోర్ట్ గార్మెంట్ యూనిట్‌ను ప్రారంభిస్తోంది. 1.60 లక్షల భారీ ఎస్ఎఫ్‌టీతో షెడ్ నిర్మాణాన్ని టీఎస్ఐఐసీ చేపట్టింది. షెడ్డు, ఆఫీస్ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి.

ఉపాధి లక్ష్యంగా..

సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు చొరవతో 2400 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో టెక్స్‌ఫోర్ట్ కంపెనీ పరిశ్రమను పెట్టేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ యూనిట్‌లో 500 మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. మరో వెయ్యి మందికి ఉపాధిని కల్పించే దిశగా ఆ కంపెనీ యూనిట్‌ను విస్తరిస్తోంది. గోకుల్‌దాస్ సంస్థ తయారీ చేస్తున్న లోదుస్తులను విదేశాలకు ఎగుమతి చేస్తుంది. టెక్స్‌ఫోర్ట్ ఏర్పాటుతో 2000 మంది మహిళలు, మరో 400 మంది సిబ్బందికి ఉపాధి లభించనుంది. ఆగస్టు నెలాఖరులోగా వర్క్‌షెడ్ల నిర్మాణాలను టీఎస్ఐఐసీ పూర్తి చేయనుంది.



కొనసాగుతున్న ఆఫీస్ భవన పనులు

66 ఎకరాల్లో అపెరల్ పార్క్

జిల్లాలోని మహిళలు బీడీలు చేస్తూ.. మిషన్, జూకీ మిషన్ కుడుతూ అరకొర ఆదాయంతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇలాంటి వారికి రెడీమేడ్ వస్త్రాల తయారీ కంపెనీలు మెరుగైన ఉపాధి కల్పిస్తున్నాయి. ఆయా సంస్థల్లో వివిధ పనుల కోసం యువకులను సైతం నియమించుకుంటున్నారు. సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద 66 ఎకరాల్లో అపెరల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. మరిన్ని కంపెనీలు ఇక్కడికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి.

తుది దశకు పనులు



పెద్దూరు అపెరల్ పార్క్‌లో టెక్స్‌ఫోర్ట్ కంపెనీ యూనిట్‌ను ఏడెకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. టీఎస్ఐఐసీ సంస్థ టెక్స్‌ఫోర్ట్ యూనిట్ కోసం షెడ్లను నిర్మిస్తుంది. నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. ఇది పూర్తయితే చాలా మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రెండు నెలల్లో టెక్స్‌ఫోర్ట్ యూనిట్‌ను ప్రారంభించేందుకు ఆ సంస్థ ప్రణాళిక సిద్ధం చేస్తుంది. – అశోక్‌రావు, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్



విశాలలో తారల చమక్కు

వేములవాడలోని విశాల షాపింగ్‌మాల్‌లో పట్టుచీరల మాల్‌ను సోమవారం హీరోయిన్ నేహాశెట్టి, హీరో కార్తికేయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక స్టేజీపై స్టెప్పులేసి ఉత్సాహం నింపారు. విశాల షాపింగ్‌మాల్ యజమానులు వేముల శ్రీనివాస్, వేముల విష్ణు, వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లకుండా వేములవాడలోనే ప్రత్యేక పట్టుచీరలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కొనుగోళ్లపై ప్రతీ గంటకు ఒక్క గ్రాము బంగారం ఆఫర్ పెట్టినట్లు తెలిపారు. సెస్ డైరెక్టర్ నామాల ఉమ, కౌన్సిలర్ గూడూరి లక్ష్మి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు అవదూత రజనీకాంత్, పురప్రముఖులు, వస్త్ర వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు. – వేములవాడ



వైన్స్‌టెండర్లలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఓ మహిళ టెండర్ దాఖలు చేశారు. సిరిసిల్లలోని వైన్‌షాపులకు భారీగా పోటీ ఉంటుందని తెలుస్తుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

సారూ.. పట్టించుకోండి

- ప్రజావాణికి బారులుతీరిన బాధితులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్లు

సిరిసిల్లఅర్బన్: 'సారూ.. మా సమస్యలు జర తీర్చుండ్రి.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరన్నా మమ్ముల గురించి ఆలోచించుండ్రి..' అంటూ బాధితులు కలెక్టరేట్ బాట పట్టారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి భారీగా బాధితులు తరలివచ్చారు. వివిధ సమస్యలపై 34 అర్జీలను అందించారు. అర్జీలను అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్ స్వీకరించారు. సిరిసిల్ల డీఆర్డీవో ఆనంద్‌కుమార్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య తదితరులు ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

నాణ్యత పాటించడం లేదు



కరీంనగర్ సిరిసిల్ల ప్రధాన రహదారి కొదురుపాక వద్ద నిర్మిస్తున్న ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదు. పాతరోడ్డును తొలగించకుండానే దానిపైనే మట్టి పోసి రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు త్వరగా పాడవుతుందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడ లేదు. – నీలోజిపల్లి గ్రామస్తులు

కళాకారుల సమస్యలు పరిష్కరించండి



మా సమస్యలు పరిష్కరించండి. అర్హులైన కళాకారులకు ప్రభుత్వం నుంచి గుర్తింపుకార్డులు అందజేయండి. వృద్ధ కళాకారులకు పెన్షన్ మంజూరు చేయండి. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, లేదా స్థలం ఇప్పించండి. – జిల్లా సాంస్కృతిక కళాసంస్థల సమాఖ్య సభ్యులు

ప్రత్యేక జీపీ విరమింపజేసుకోవాలి



మేము ఇల్లంతకుంట మండలంలోని రేపాక లోని 9, 10వ వార్డు కాలనీవాసులం. మా వార్డులను కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారు. దీని ద్వారా పాలనపరంగా, అభివృద్ధిపరంగా ఇబ్బందులు ఎదురవుతాయి. మా వార్డులను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసే ప్రతిపాదన విరమించుకోవాలి. – రేపాక 9, 10 కాలనీవాసులు

పొలాల కాడికి రోడ్డు వేయాలి



మాకు పెద్దూరు శివారులో సర్వేనంబర్ 405లో ప్రభుత్వం నుంచి పట్టాలు పొందాం. అక్కడే ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. ఇటీవల మెడికల్, ఆస్పత్రి నిర్మాణాలకు మా భూములు స్వచ్ఛందంగా ఇచ్చాం. మిగిలు భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాం. ఆ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు వేయాలి. – పెద్దూరుకు చెందిన రైతులు

వేములవాడలో మళ్లీ గులాబీ రెపరెపలు



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- రుద్రంగిలో అభివృద్ధి పనులకు భూమి పూజ

రుద్రంగి(వేములవాడ): రానున్న ఎన్నికల్లో వేములవాడలో మళ్లీ గులాబీ జెండా రెపరెపలాడుతుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. రుద్రంగిలో రూ.40.70 లక్షలతో ఎమ్మార్సీ బిల్డింగ్, గంగపుత్ర సంఘం భవనంలో రూ.3లక్షల విలువ గల మిగులు పనులకు సోమవారం భూమి పూజ చేశారు. మన ఊరు–మన బడిలో భాగంగా రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన తరగతి గదులను ప్రారంభించారు. 12 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను అందించారు. రుద్రంగిలో మిగిలి ఉన్న రోడ్లు, డ్రెయినేజీలకు త్వరలోనే నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తామన్నారు. రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎంపీడీవో మాలోతు శంకర్, డీటీ మల్లయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, ఎంపీటీసీ మంచె లావణ్య, కో–ఆప్షన్ మెంబర్ జమీలా బేగం, బీఆర్‌ఎస్ మండల, గ్రామశాఖల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి, దయ్యాల కమలాకర్, నాయకులు గంగం మహేశ్, మంచె రాజేశం పాల్గొన్నారు.

హమారా భారత్ మహాన్



వేములవాడ: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం వేములవాడ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్‌ర్యాలీ తీశారు. ఎర్రం మహేశ్, మార్త సత్తయ్య, రేగుల మల్లికార్జున్, రేగుల సంతోష్‌బాబు, ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, బుర్ర శేఖర్, సురేందర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, రాకేశ్ పాల్గొన్నారు.

దొంగతనంపై పోలీసుల విచారణ

- రంగంలోకి డీఎస్పీ, ముగ్గురు సీఐలు
- అనుమానితులపై దృష్టి

వేములవాడ: వేములవాడలోని పిల్లి లత ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన దొంగతనంపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ సోమవారం వేములవాడటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. దొంగను పట్టుకునేందుకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్‌కుమార్‌తో కూడిన అధికారుల బృందం పట్టణంలోని భగవంతరావునగర్‌లోని పిల్లి లత ఇంటికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలు, ఇంటి పరిసరాలు, బంగ్లా పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మరోసారి దొంగతనం తీరు, పిల్లి లత ప్రతిఘటించిన తీరును అడిగి తెలుసుకున్నారు. తన కిరాణం షాపునకు తరచూ ఎవరైన వచ్చి ఉంటే వారి వివరాలు తెలియజేయాలని కోరారు. అంతే కాకుండా ఆ వీధిని అడుగడుగునా పోలీసులు అనుమానితుల కోసం గాలిస్తున్నారు. యువకులు, కాలనీవాసులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఆ ప్రాంతంతోపాటు చెక్కపల్లి ప్రధాన రహదారిపై ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు. పోలీసులు ఏడు బృందాలుగా విడిపోయి దొంగ ఆచూకీ కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవల వేములవాడలో చిన్నచిన్న దొంగతనాలు సైతం పెరిగినట్లు స్థానికులు ముచ్చటిస్తున్నారు. పట్టణంలోని వార్డుల్లోని ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టౌన్ సీఐ కరుణాకర్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే సీసీ కెమెరాలు ఉన్న ఇంటి యజమానులు తప్పకుండా ఇంటి ముందున్న పరిసరాలు కవర్ చేసేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.



విచారణ చేపడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్‌కుమార్



జీవనభృతి పోరాటం

సిరిసిల్లటౌన్: జీవనభృతి అమలు చేయాలని కోరుతూ బీడీ కార్మికులు సోమవారం కదంతొక్కారు. ఎన్నికల హామీ అయిన జీవనభృతిని వెంటనే అమలు చేయాలని కోరుతూ బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో వేలాదిమంది బీడీ కార్మికులు కలెక్టరేట్ ముట్టడికి తరలివచ్చారు. వివిధ సంఘాల నాయకులు దండి వెంకట్, సిరిగాధ సిద్ధిరాములు, ముద్రకోల ఆంజనేయులు, మేకల రాజేందర్‌స్వామి, సయ్యద్, గురుమూర్తి, సతీశ్, రుక్మిణి, స్వరూప, రజిత, రెహాన, లక్ష్మి, రాజేశ్వరి, భవాని, లత, గీత, రజిత, శ్రీలత, లావణ్య, భార్గవి, ఆసిన, మమత, అంజలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంభీరావుపేట వాసికి గోల్డ్‌మెడల్



కుటుంబ సభ్యులతో రాజేశ్

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన రేణికింది రాజేశ్ వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. రాజేశ్ ఎంబీబీఎస్‌లో గోల్డ్‌మెడల్ సాధించగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. కాగా, రాజేశ్ తల్లిదండ్రులు సుదర్శన్, సంధ్యతో పాటు గ్రామస్తులు, అభినందించారు.

అధిక ఫీజలను నియంత్రించాలి



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజు దోపిడీని అడ్డుకోవాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం డీఈవో రమేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేటలోని కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తున్నా స్థానిక ఎంఈవో మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ విద్యాసంస్థలు, ఎంఈవో తమ వైఖరిని మార్చుకోవాలని కోరారు. యువమోర్చా నాయకులు సనత్, అనిల్ తదితరులు ఉన్నారు.

హై ఓల్టేజీతో కాలిన మోటార్లు



కాలిన మోటార్లను తీస్తున్న రైతులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విద్యుత్ హై ఓల్టేజీ సరఫరాతో మండలంలోని దేశాయిపల్లికి చెందిన పలువురు రైతుల వ్యవసాయ మోటార్లు సోమవారం కాలిపోయాయి. గ్రామానికి చెందిన సిరిసిల్ల దేవయ్య, నకీర్తి యాదగిరి, పర్శరాములు, తుమ్మల కొమురయ్య, ఎలుసాని ఆంజనేయులు, కంకనాల నర్సయ్యలకు సంబంధించిన వ్యవసాయ మోటార్లు కాలిపోయాయి.

'గృహలక్ష్మి'లో అవకాశం కల్పించాలి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజీపేట గ్రామానికి చెందిన విక్కుర్తి మల్లయ్య, దేవయ్య నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగులు. గృహలక్ష్మి పథకంలో తమకు అవకాశం కల్పించాలంటూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను వేడుకున్నారు. పథకానికి గడువు ముగిసిందని అధికారులు తెలపడంతో నిరాశతో వారు వెనుదిరిగారు.

చర్చి నిర్మాణాన్ని నిలిపివేయాలి

చందుర్తి : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని గ్రామ యువకులు సోమవారం జనహిత కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. రామన్నపేటకు చెందిన కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ పరిధిలో నిర్మాణం చేపట్టడాన్ని గ్రామస్తులు వ్యతిరేకిస్తూ అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు పనులు నిలిపివేసి, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

మూలనపడ్డ యంత్రాలు

- మండల సమాఖ్యలకు గుదిబండగా ట్రాక్టర్లు
- వానాకాలం సీజన్‌లోనూ ఉపయోగంలోకి రాని పనిముట్లు
- నిర్వహణ భారంతో ఇబ్బందులు
- తుప్పు పడుతున్న వైనం
- జిల్లాలో ఏడు కస్టమ్ హైరింగ్ సెంటర్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఐకేపీ మండల సమాఖ్య ట్రాక్టర్ గంభీరావుపేటలోనిది. ఓ చెట్టుకింద ఏడాదిగా వానకు తడుస్తూ..ఎండకు ఎండుతూ ఉంది. మండల సమాఖ్య బాధ్యులు, అధికారులు పట్టించుకోవడం లేదు. చివరకు ట్రాక్టర్ పని చేస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. గంభీరావుపేటలో 20 వేల ఎకరాలు సాగులో ఉండగా రైతులు దీనిని పెద్దగా ఉపయోగించుకోవడం లేదు. అందుకు తగ్గట్టు అధికారులు రైతులకు అవగాహన కల్పించలేదనే ఆరోపణలు వస్తున్నాయి.



ముస్తాబాద్‌లో వినియోగంలో లేని ట్రాక్టర్, పనిముట్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): పేద రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్లు మండల సమాఖ్యలకు గుదిబండగా మారాయి. జిల్లాలోని ఏడు మండల కేంద్రాల్లో జిల్లా ఐకేపీ సమాఖ్య ఏడాదిన్నర క్రితం హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. ఇందుకు ఒక్కో కేంద్రానికి రూ.10.50 లక్షల చొప్పున రూ.73.50 లక్షలు మంజూరు చేసింది. ట్రాక్టర్లు, రొటోవేటర్లు, గడ్డి చుట్టే యంత్రాలు, నాగళ్లు కొనుగోలు చేశారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే కస్టమ్ హైరింగ్ సెంటర్లు నేడు వెలవెలబోతున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌లోనూ ట్రాక్టర్లు, రొటొవేటర్లు కిరాయికీ తీసుకునే వారు కరువయ్యారు. అద్దె యంత్రాల విషయంపై గ్రామాల్లో ప్రచారం కల్పించకపోవడం, అధికారుల ఉదాసీనతే ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

యంత్రాలు వినియోగించుకోని రైతులు

జిల్లాలో రెండేళ్ల క్రితం పైలెట్ ప్రాజెక్టుగా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో జిల్లా మహిళా సమాఖ్య ద్వారా ట్రాక్టర్, రొటోవేటర్, హార్వెస్టర్‌ను ఏర్పాటు చేశారు. కొంతమేరకు రైతులు అద్దెకు తీసుకొని పనులు చేసుకోగా ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి, ఇల్లంతకుంట, బోయినపల్లి, కోనరావుపేట మండలాల్లో హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లా సమాఖ్య మండల సమాఖ్యలకు రుణాలు అందించింది. గతేడాది మేలో ఈ పథకాన్ని ప్రారంభించారు. అనుకున్న స్థాయిలో రైతులు అద్దె యంత్రాలను వినియోగించుకోలేదు. ముస్తాబాద్‌లో ట్రాక్టర్ మెయింటెన్స్ కూడా చేయలేదు. ట్రాక్టర్‌కు ఎకరానికి అద్దె రూ.8వేలు, రొటోవేటర్ అద్దె ఎనిమిది గంటలకు రూ.2వేలు, గడ్డి చుట్టే యంత్రానికి ఎనిమిది గంటలకు రూ.2వేలుగా నిర్ణయించినా రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతోనే యంత్రాలు వినియోగించుకోవడం లేదని భావిస్తున్నారు.

మండల సమాఖ్యలపై భారం..

ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేలా కస్టమ్ హైరింగ్ సెంటర్లు ప్రారంభించింది. జిల్లా సమాఖ్య ఏడు మండల సమాఖ్యలకు రుణాల ద్వారా అందించిన యంత్రాలపై నెలనెలా కొన్ని సమాఖ్యలు వడ్డీలు చెల్లిస్తున్నాయి. ఒక్కో సమాఖ్యపై నెలకు రూ.10వేల వడ్డీ పడుతోంది. ఇప్పటికే కొన్ని మండలాల సమాఖ్యలు మొత్తం రూ.10.50 లక్షలు చెల్లించారు. కొన్ని సమాఖ్యలకు ప్రభుత్వం రూ.2.50 లక్షల సబ్సిడీ అందించింది. కేవలం రొటోవేటర్, గడ్డిచుట్టే యంత్రాలను మాత్రమే రైతులు తీసుకెళ్తున్నారు. దీంతో ట్రాక్టర్ల నిర్వహణ భారం సమాఖ్యలకు భారంగా మారింది. చాలామంది రైతులకు సొంత ట్రాక్టర్లు ఉండటం సమాఖ్యలకు ప్రతికూలంగా మారింది.

అవగాహన కల్పించాలి



మండలకేంద్రంలో హైరింగ్ సెంటర్ ఉందనే విషయం తెలియదు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తే చాలామంది అద్దెకు తీసుకుంటారు. ట్రాక్టర్ కిరాయి అందరికీ ఉపయోగం. రైతులే డీజిల్ ఖర్చులు భరించడం కొంత ఇబ్బందికరమే.

– కొండం రాజిరెడ్డి, రైతు, నామాపూర్

ప్రభుత్వ లక్ష్యం నేరవేర్చాలి



ముస్తాబాద్ ఐకేపీలో ట్రాక్టర్ కిరాయికి ఉందనే విషయం చాలామందికి తెలియదు. ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చాల్సిన బాధ్యత అధికారులదే. ట్రాక్టర్లు లేని రైతులు ఐకేపీ ట్రాక్టర్‌ను వినియోగించేలా తెలపాలి. అద్దె రేట్లు కూడా తగ్గిస్తే బాగుండు.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, ముస్తాబాద్

రైతులు వినియోగించుకునేలా చూస్తాం

కొన్నిచోట్ల ట్రాక్టర్లను ఎవరు అద్దెకు తీసుకోవడం లేదు. రైతులకు గ్రామాల్లో ట్రాక్టర్లు ఉన్నాయి. స్ప్రేయర్లు, రొటోవేటర్లు మాత్రమే తీసుకెళ్తున్నారు. ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. అధికారుల ఆదేశాల మేరకు అందరు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. – పద్మయ్య, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

కాంగ్రెస్‌తోనే 'మహిళా సాధికారత'



మాట్లాడుతున్న ప్రవీణ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోని) అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహిళా మండల కమిటీని ఎన్నుకున్నారు. మహిళా మండల అధ్యక్షురాలిగా హారిక రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా సంగీత, ప్రధాన కార్యదర్శిగా సరితా రెడ్డి, కార్యదర్శిగా సునీత, భాగ్యలక్ష్మి గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టోని మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు సానియా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, తదితరులు పాల్గొన్నారు.

బ్యాగు మోత..



స్కూల్ బ్యాగులు తీసుకెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వేములవాడ : రోజూ పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు వాటిని మోయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి, రెండో తరగతి చదువుతున్న విద్యార్థులకు సైతం పుస్తకాలతో బ్యాగులు నిండుతున్నాయి. దీంతో చిన్నారులు మోయలేక అవస్థలు పడుతున్నారు. కొందరి చిన్నారుల తల్లిదండ్రులు స్కూల్ బస్సువరకు బ్యాగులను తీసుకెళ్తున్నారు. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ బ్యాగులు మోసుకెళ్తుండగా కెమెరాలో 'సాక్షి' క్లిక్ మనిపించింది.

వీటీడీఏ కార్యాలయం సిద్ధం

- టీటీడీ కల్యాణమండపంలోకి ఈవో ఆఫీస్
- అమ్మవారి కాంప్లెక్స్‌లోకి వీటీడీఏ
- పనులు చేపట్టిన అధికారులు



వీటీడీఏ ఆఫీస్ ఏర్పాటు చేసే అతిథి భవనం

వేములవాడ: రాజన్న భక్తులకు, స్థానికులకు సేవలందించేందుకు రాష్ట్ర దేవాదాయశాఖ మరింత కసరత్తు చేస్తుంది. సీఎం కేసీఆర్ 2015 జూన్ 18న వేములవాడకు వచ్చిన సందర్భంగా రాజన్న గుడి, వేములవాడ పట్టణం, ఈ ప్రాంతం అభివృద్ధి కోసం వీటీడీఏను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ ఆఫీస్ హైదరాబాద్‌లోనే కొనసాగగా.. ఇటీవల వేములవాడలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆమేరకు కలెక్టర్, ఆలయ అధికారులు ఇటీవల సర్వే నిర్వహించారు. మొత్తానికి అమ్మవారి కాంప్లెక్స్‌ను వీటీడీఏ కార్యాలయంగా మార్చేందుకు అధికారులు పనులు ప్రారంభించారు.

టీటీడీ ఆఫీస్‌లోకి ఈవో కార్యాలయం

రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న క్రమంలో గుడి చెరువును 35 ఎకరాల మేర పూడ్చి వేసి ఇందులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులోభాగంగా ఇటీవల మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శివార్చన వేదిక పనులకు భూమిపూజ చేశారు. రాజేశ్వరపురం వసతి గదులను కూల్చివేశారు. అనంతరం ఈవో కార్యాలయంతోపాటు ప్రసాదాల తయారీ గోదాం, ఇతర నిర్మాణాలను సైతం కూల్చనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈవో కార్యాలయాన్ని టీటీడీ కల్యాణ మండపంలోకి మార్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పనులు పూర్తవగానే ఈవో ఆఫీస్‌ను టీటీడీ కల్యాణ మండపంలోకి మార్చనున్నారు.



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో సోమవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా జరిగింది. మహామండపంలో ప్రత్యేక పూజలు చేసి, అర్చకులు మట్టితో చేసిన 366 మృత్తికలు, పిండితో చేసిన 366 జ్యోతులను లింగాకారంలో పేర్చి దీపాలు వెలిగించారు.

నిధులు మంజూరుపై హర్షం



కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ తరఫున రూ.3కోట్లు మంజూరు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మంత్రి కేటీఆర్ చిత్రపటానికి ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పేరిట అర్చకులు ఆలయంలో అర్చన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్ మాట్లాడుతూ 200 ఏళ్ల చరిత్ర గల పురాతన ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ తరపున పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించిన మంత్రితోపాటు వైవీ సుబ్బారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ పందిర్ల నాగరాణి, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బొమ్మకంటి రవీందర్, మేగి నర్సయ్య, మంజుల గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1.10కోట్ల మంజూరు..

ముస్తాబాద్: మండలకేంద్రంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ ద్వారా రూ.1.10 కోట్ల మంజూరుపై బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రి కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏళ్ల నాటి ఆలయాన్ని పునర్ నిర్మించేందుకు మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. నిధులు మంజూరు చేసిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సర్పంచ్ సుమతి, శ్రీశివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్ ఎల్సాని దేవయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, సర్వర్, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శెరయ్య, కొండ శ్రీను, రాజు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి యువకుడి మృతి

- ఎల్లారెడ్డిపేటలో విషాదం
- తల్లితో ఘర్షణ పడి అఘాయిత్యం



సురేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎరువుల సురేష్(25) సోమవారం వ్యవసాయ బావిలో దూకి బలన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. సురేష్ మూడు రోజుల క్రితం తల్లి రాజమల్లవ్వతో గొడవ పడ్డాడు. అది మనసులో పెట్టుకొని మరుసటి రోజు నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు సురేష్ ఆచూకీ కోసం గాలిస్తుండగా సోమవారం ఇంటి సమీపంలోని బావిలో శవమై కనిపించాడు. ఇంట్లో నుంచి వెళ్లిన రోజే సురేష్ బావిలో దూకి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుళ్లిన మృతదేహానికి బావి వద్దనే పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి దేవయ్య కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. మృతునికి తల్లి, సోదరి ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

కొడుకు మృతిపై అనుమానాలు

తన కొడుకు సురేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి ఎరువుల మల్లవ్వ సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

గుండెపోటుతో లెక్చరర్ మృతి



శ్రీకాంత్ (ఫైల్)

వేములవాడ: పట్టణానికి చెందిన కేశన్నగారి శ్రీకాంత్ (62) (ప్రైవేట్ లెక్చరర్) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య రాధిక, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీకాంత్ మృతిపట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బ్రాహ్మణ సంఘం నాయకులు, ఆలయ అర్చకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో బడే పహాడ్ యాత్ర

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పలు గ్రామాల నుంచి మైనార్టీలను ప్రత్యేక బస్సులలో సర్పంచ్ వెంకటరెడ్డి సోమవారం బడే పహాడ్(పెద్ద గుట్ట) దైవ దర్శనానికి తీసుకెళ్లారు. స్థానిక పెద్ద బడి నుంచి బస్సులను ప్రారంభించారు. ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ ఏర్పాట్లను చేశారు. గతంలో ఎల్లారెడ్డిపేట గ్రామస్తులను దాదాపు 40 బస్సుల్లో యాదాద్రికి తీసుకెళ్లారు. ఆతర్వాత మండలంలోని వివిధ గ్రామాల నుంచి వీవో అధ్యక్షులను భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనానికి తరలించారు. ప్రస్తుతం పది బస్సుల్లో ముస్లింలను పెద్దగుట్టకు తీసుకెళ్లారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మండల మైనార్టీ అధ్యక్షుడు హైమద్ పాల్గొన్నారు.



'అమరుల కుటుంబాలను విస్మరిస్తున్న ప్రభుత్వం'



మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

వీర్నపల్లి(సిరిసిల్ల): తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం విమర్శించారు. వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి, రంగంపేటల్లో ఇటీవల మృతిచెందిన దాసరి విజయ, భూక్య ప్రవీణ్ కుటుంబాలను సోమవారం పరామర్శించిన అనంతరం మాట్లాడారు. త్వరలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఆకర్షించేందుకు పథకాలను తీసుకొస్తుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, పర్శరాములు, నవీన్‌యాదవ్, ప్రభాకర్, రాజాసింగ్, మహేశ్, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలి

వీర్నపల్లి : ఏడాది గడుస్తున్నా అడవి పదిర వంతెన నిర్మాణం చేపట్టడం లేదని వెంటనే పనులు ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. వాగు సాకుతో గ్రామంలోకి బస్సు రావడం లేదన్నారు. లాల్‌సింగ్ తండా నుంచి అడవి పదిర గ్రామంలోకి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అడవి పదిరలోకి బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లాలంటే కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోందని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు విష్ణువర్ధన్, జాషువా, విద్యార్థులు మనో, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల బలిదానాలతోనే స్వాతంత్ర్యం



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఎంతోమంది త్యాగధనులు ఆత్మబలిదానాలతో స్వాతంత్ర్యం సిద్ధించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో యూనియన్ నాయకులు 'జన మేల్కొలుపు' నిరసన కార్యక్రమం చేపట్టారు. స్వాతంత్ర్య ఫలాలు పేదలు, కార్మికులు, కర్షకులకు కాకుండా కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ వైఫల్యాలను ఎండగడుతామని హెచ్చరించారు. నాయకులు ఎలిగేటి రాజశేఖర్, సూరం పద్మ, నక్క దేవదాసు, సిరిమల్ల సత్యం, గుండు రమేశ్, చంద్రకాంత్, మల్లేశం, సురేశ్, తిరుపతి, పోచమల్లు, జగదీశ్ పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ కోసం పోరాడాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కొట్లాడి సాధించుకుంది భౌగోళిక తెలంగాణ తప్ప, సామాజిక తెలంగాణ కాదని, నీళ్ల నిధులు, నియామకాలు ప్రజలకు అందినప్పుడే నిజమైన తెలంగాణగా భావించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఈనెల 21న గద్దర్ సంస్మరణ సభను నిర్వహించనుండగా అందుకు సంబంధిత కరపత్రాలను మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ ఏర్పాటులో గద్దర్ తన ఆట పాటలతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. సంస్మరణ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది తరలిరావాలని కోరారు. నాయకులు పురుషోత్తం, చంద్రన్న, రాజేందర్, బాలమల్లు, శంకర్, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.